

వి రన్ ఫర్ తిరుపతి



ఉత్సాహం ఉరకలేసింది. వి రన్ ఫర్ తిరుపతి.. కార్యక్రమంలో పిల్లలు, యువత హుషారుగా పరుగు తీశారు. శాప్, యాంటీ నార్కోటిక్స్ పోలీస్ విభాగం, వి వైబ్ ప్రైవేటు సంస్థ సంయుక్తంగా ఆదివారం ఉదయం తిరుపతిలో ఈ కార్యక్రమం నిర్వహించాయి. తారకరామ క్రీడా మైదానం నుంచి ఎస్వీయూ రైల్వే వంతెన మీదుగా చెర్లోపల్లె క్రాస్ వరకు పరుగు పందెం నిర్వహించారు. క్రీడాకారులు, పోలీసులు 10కే రన్, విద్యార్థులు 5కే రన్, పిల్లలు, పెద్దలు 3కే రన్ ఎంచుకొని పోటీపడ్డారు. అందరూ కాషాయ రంగు టీ షర్టులతో రోడ్డుపై పరుగు తీస్తుంటే స్థానికులు ఆసక్తిగా తిలకించారు. పరుగు పందెంలో విజేతలకు బహుమతులు అందజేశారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు, ఎస్పీ సుబ్బరాయుడు, ఈగల్ ఎస్పీ నగేష్, ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు తదితరులు మాట్లాడుతూ.. డ్రగ్స్‌కు, మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలన్నారు.

- తిరుపతి(క్రీడలు), ఆంధ్రజ్యోతి



వరి పంటలో మృతదేహాన్ని మోసుకెళ్తున్న రావులపాడు గ్రామస్తులు

శ్మశానానికి దారేదీ?

పెళ్లకూరు మండలం రావులపాడులో శ్మశానానికి దారిలేక ఇబ్బంది పడుతున్నారు. ఆ గ్రామానికి చెందిన దుర్గి వెంకటరమణ నాయుడు ఆదివారం మృతిచెందారు. శ్మశానికి దారిలేకపోవడంతో ఆయన మృతదేహాన్ని పొలాల మీదుగా కిలోమీటరు దూరంలో ఉన్న స్వర్ణముఖి నది ఒడ్డు వరకు మోసుకెళ్లాల్సి వచ్చింది. అక్కడ చెట్లు పుట్టలతో నిండిపోయి ఉండటంతో ఖననం చేయడానికి ఇబ్బంది పడాల్సి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

- పెళ్లకూరు, ఆంధ్రజ్యోతి

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం

శ్రీకాళహస్తీశ్వరాలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. సుమారు 29 వేలమంది భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 2,496మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,860మంది దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,390మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 908, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 268మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 223మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 54మంది పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 19,470 విక్రయించినట్టు అధికారులు తెలిపారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ముక్కంటి ఆలయం వద్ద ఉన్న భక్తులు

ఇంకా జగనే సీఎం అట!

- సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఎండీయూ వాహనంపై తొలగిన బొమ్మ





ఉదయం జగన్ బొమ్మతో.. సాయంత్రం తొలగిన బొమ్మ

కూటమి ప్రభుత్వం ఏర్పాటై.. చంద్రబాబు ముఖ్యమంత్రి అయి ఆరు నెలలు దాటింది. అయినా పిచ్చాటూరు మండలం ఎస్ఎస్‌బీ పేటలో రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్న వాహనంపై మాత్రం జగన్ బొమ్మే ఉంది. ఆదివారం ఉదయం రేషన్ సరుకుల పంపిణీ సందర్భంగా ఈ విషయం బయటపడింది. జగన్ బొమ్మ ఇంకా తొలగించకుండా గ్రామాలకు వెళ్లి సరకులు పంపిణీ చేస్తుండటం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీనిపై తహసీల్దార్ రమేష్‌బాబు స్పందించారు. సాయంత్రానికంతా జగన్ బొమ్మను తొలగించారు. కానీ, నవరత్నాల లోగో మాత్రం అలాగే ఉంది.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి

ఆగని అవినీతి!

సస్పెన్షన్లు తప్ప వీగిపోతున్న కేసులు

నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం

ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారంటూ తహసీల్దారు క్యాడర్ అధికారి పరమేశ్వరస్వామిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసు నడుస్తుండగానే వారం కిందట ఆయనకు ఎర్రావారిపాలెం తహసీల్దారుగా పోస్టింగ్ వచ్చింది. దీని వెనుక రాజకీయ పలుకుబడి ఉందన్న విమర్శలున్నాయి.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పనిచేస్తూ ఆదాయానికి మించి ఆస్తులు కూడబబెట్టారనే ఆరోపణలపై మదనపల్లె మాజీ ఆర్డీవో మురళిపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు. ఆయన ఇల్లు, బంధువులు, స్నేహితుల ఇళ్లపై దాడులు చేసి భారీ మొత్తంలో ఆస్తుల రికార్డులు, నగదు, బంగారు నగలు ఇతరత్రా పత్రాలు సీజ్ చేశారు.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి



డిసెంబరు 9. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం. ఏటా ఈ కార్యక్రమం జరుపుకొంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. లంచం తీసుకుంటున్న అధికారులనూ ప్రజల ఫిర్యాదుతో పట్టుకుంటున్నారు. అయినా, అవినీతి ఆగడం లేదు. రాజకీయ, ఆర్థిక ఒత్తిళ్లు, ఓటు రాజకీయాలతో కేసులు పక్కదారి పడటమే కారణమన్న విమర్శలున్నాయి. గత రెండేళ్ల కాలంలో దాదాపు 8 కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో పట్టుబడిన అధికారులను సస్పెండు చేస్తున్నారు. అయితే ఏసీబీ కేసుల పరిస్థితిని పరిశీలిస్తే అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన వా రి లో కొందరికి మాత్రమే శిక్షలు పడుతుండగా మరికొందరు ఎలాంటి చర్యలు లేకుండా మళ్లీ ఉద్యోగంలో చేరుతున్నారు. మరికొందరిపై విచారణకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంలేదు. లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న కొన్ని కేసుల్లో బాధితులకు సర్దిచెప్పడం లేదా ఒత్తిడి తీసుకొచ్చి కోర్టుల్లో సాక్ష్యం చెప్పనీయకుండా చేసి అవినీతి అధికారులు బయటపడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అవినీతి కేసుల్లో పట్టుబడిన వారిపై చర్యలు ఉంటేనే అవినీతి తగ్గే అవకాశాలున్నాయి.

రెండు రకాల కేసులు

సాధారణంగా ఏసీబీ అధికారులు రెండు రకాల కేసులు నమోదు చేస్తారు. ఇందులో మొదటిది లంచం అడుగుతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. సంబంధిత ఉద్యోగులు లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం. వీటిని ట్రాప్ కేసులంటారు. రెండోది ఆదాయానికి మించి ఆస్తుల కేసు. అవినీతి చేసి ఆస్తులు సంపాదించినట్లు ఫిర్యాదులు వస్తే.. ఏసీబీ అధికారులు మొదట వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత వారి ఇళ్లు, బంధువులు, బినామీల ఇళ్లపై ఒకేసారి దాడులు చేస్తారు. డబ్బు, పత్రాలు, బంగారం, వెండి వస్తువులు స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత వారి జీతం, ఇతర అధికారిక ఆదాయాలు అన్నీ లెక్కవేసి అంతకంటే ఎక్కువ ఉంటే అది ఎలా వచ్చిందో విచారణ జరుపుతారు. సరైన కారణాలు చెప్పకుంటే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని కేసు పెడతారు. ఆ ఆదాయానికి సంబంధించి సాక్ష్యాధారాలు చూపితే కేసు ఉండదు. స్వాధీనం చేసుకున్న వాటిని వెనక్కి ఇచ్చేస్తారు.

ఫిర్యాదు చేస్తేనే ప్రయోజనం

వివిధ పనులకోసం అధికారులు లంచం కోసం వేధిస్తే తమకు ఫోను చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. 24 గంటలూ సేవలు అందుబాటులో ఉండే అవినీతి నిరోధక శాఖ హెల్ప్ లైన్ నెంబరు 1064కు.. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏసీబీ అదనపు ఎస్పీ 94404 46130, డీఎస్పీ 94404 46190, కార్యాలయ ఫోన్ నెంబరు 0877-2220252కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. అవినీతిని అరికట్టడం అనేది ఓ సామాజిక బాధ్యతగా గుర్తించి ప్రజలు ఫిర్యాదు చేయాలని అధికారులు కోరుతున్నారు. ఇక, అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటే మిగతా వారు వెనకడుగు వేస్తారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 2,454 మంది హాజరు

తిరుపతి(విద్య), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు 2,454 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు ఆర్థికసాయం అందించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఏటా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు తొమ్మిదవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏటా రూ.12వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తుంది. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పరీక్షకు జిల్లానుంచి 2,553 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఆదివారం 12 కేంద్రాల్లో ప్రతిభా పరీక్ష నిర్వహించగా, 99 మంది గైర్హాజరవడంతో 2454 మంది విద్యార్థులు పరీక్ష రాశారు.

శేషాచలంలో వన్యప్రాణుల సంరక్షణకు ముందడుగు

వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు

మంగళం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి) : శేషాచల అటవీ ప్రాంతంలోని అరుదైన జంతువులను, పక్షులను, కీటకాలను రక్షించే దిశగా అటవీ శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటుకు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. భాకరాపేట, తిరుపతి, బాలాపల్లె, యాంటీ పోచింగ్ రేంజ్‌లను కొత్తగా ఏర్పాటు చేసే వైల్డ్ శాంచూరి కిందకు తీసుకువస్తారు. దీనికి ఒక డీఎఫ్‌వోను నియమించుకున్నారు. అంతేకాకుండా అదనపు నిధులు, సిబ్బందిని కూడా కేటాయించే అవకాశముంది. శేషాచలం కొండలకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య పెరిగి జనారణ్యంలోకి రావడం, రోడ్డు ప్రమాదాల్లో, వేటగాళ్ల బారిన పడి ప్రాణాలు కోల్పోతుండడంతో వాటి సంరక్షణకు అటవీశాఖ వైల్డ్‌లైఫ్ శాంచూరి ఏర్పాటు చేస్తోంది. శేషాచల కొండల్లో అరుదైన పునుగుపిల్లి, దేవాంగ పిల్లి, బంగారుబల్లి, అలుగు, బిట్టుడత వంటివే కాకుండా ఏనుగులు, చిరుతలు, ఎలుగుబంట్లు, రేసు కుక్కలు, ముళ్ల పందులు, అడవిపందులు, జింకలు, దుప్పులు, నక్కలు, పాములు, పక్షులు, సీతాకోకచిలుకలు, కీటకాలు నివాసాలు ఉంటున్నాయి. గతంలో శేషాచల కొండల్లో జరిగిన పరిశోధనలో సైతం ఇక్కడ అనేక అరుదైన వృక్ష, జంతు జాలాలను గుర్తించారు. వీటితోపాటు అంతరించిపోయే దశలో ఉన్న పెద్దపులులకు కూడా శేషాచలకొండల్లో అనుకూల వాతావరణం ఉండడంతో ఇప్పటికే శేషాచల టైగర్ కారిడార్‌కు నిర్ణయం తీసుకున్నారు. వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటు చేస్తే అటవీ ప్రాంతంలోని అరుదైన వృక్షాలు, వనమూలికలే కాకుండా జంతుజాలాన్ని కూడా సంరక్షించడానికి వీలు కలుగుతుంది. ఇందులో భాగంగానే కొన్ని రోజుల క్రితం తిరుపతి కపిలతీర్థం వద్దగల సీసీఎఫ్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం కూడా నిర్వహించారు. హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ (హెచ్‌వోడీ) చిరంజీవి చౌదరి పాల్గొని వైల్డ్ లైఫ్ శాంచూరి ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వ ఆమోదానికి పంపినట్లు తెలుస్తోంది.

తిరుపతిలోని హోటల్‌కు మళ్లీ బాంబు బెదిరింపు

మెయిల్ రావడంతో అప్రమత్తమైన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హోటళ్లకు మళ్లీ బాంబు బెదిరింపు మెయిల్స్ మొదలయ్యాయి. రెండు నెలల కిందట నాలుగైదు హోటళ్లకు వరుసగా బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా తిరుపతిలోని రాజ్‌పార్కు హోటల్‌లో ఇంప్రువైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైడర్లు ఏర్పాటు చేశామని త్వరలో అవి పేలతాయంటూ హోటల్‌కు మెయిల్‌కు, మేనేజర్ సుశాయ్ వాట్సాప్‌కు ఆదివారం ఉదయం 8 గంటల ప్రాంతంలో హెచ్చరికలు వచ్చాయి. ఈ మెయిల్‌ను అలిపిరి సీఐ రాంకిషోర్‌కు పంపారు. డీఎస్పీ వెంకటనారాయణ ఆదేశాల మేరకు సీఐ రాంకిషోర్ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగార్జున రెడ్డి, లోకేష్‌బాబు, సిబ్బంది. బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్లు హోటల్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. వంటగదులు, యాత్రికులు బస చేసిన గదులు, డైనింగ్ హాళ్లు, వెయిటింగ్ హాళ్లు, రిసెప్షన్ కౌంటర్లు, మేనేజర్ గదిని తనిఖీ చేశారు. ఎక్కడా బాంబులు లేవని నిర్ధారించారు. ఈ బెదిరింపు మెయిల్ కూడా ఐఎస్ఐ ఉగ్రవాదుల పేరిట వచ్చినట్లు పోలీసులు చెబుతున్నారు.



హోటల్‌లో తనిఖీ చేస్తున్న బాంబు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది



స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ వద్ద డీటీ ఓబయ్య, పోలీసులు

20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

తడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లయిస్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం రాత్రి చేనిగుంట పాత వైన్‌షాపు వద్ద ఓ లారీలో రేషన్ బియ్యం ఉందని సమాచారం అందడంతో ఎస్ఐ కొండపనాయుడు, సివిల్ సప్లయస్ డీటీ ఓబయ్య అక్కడకు చేరుకొని డ్రైవర్ శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. లారీలో 441 బస్తాల్లో సుమారు 20 టన్నుల రేషన్ బియ్యం ఉండడంతో గోదాముకు తరలించారు. స్వాధీనం చేసుకున్న బియ్యం విలువ సుమారు రూ.10 లక్షలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. లారీ డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు బియ్యం యజమాని ప్రతాప్ నాయుడిపై కేసు నమోదు చేశారు.

ఘనంగా మహంతు ఉత్సవం



తిరుచానూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతి అమ్మవారికి ఆదివారం మహంతు ఉత్సవం జరిగింది. అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు అమ్మవారి ఉత్సవమూర్తిని పద్మసరోవరం సమీపంలోని హథీరాంజీ మఠంలోని ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. మఠం అధికారులు సమర్పించిన సారెతో అమ్మవారికి అర్చకులు అభిషేకం నిర్వహించారు. అనంతరం సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు పల్లకిని అధిరోహించి భక్తులను సాక్షాత్కరించారు. పల్లకీలో ఊరేగింపుగా సాయంత్రం ఆలయానికి చేరుకున్నారు. అంతకు ముందు మఠం అధికారులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ ఉత్సవాన్ని తిలకించడానికి స్థానికులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కరనాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

బీసీలు హక్కుల సాధనకు సంఘటితం కావాలి


ఐక్యత చాటుతున్న చంద్రగిరి నియోజకవర్గ బీసీ ఉద్యోగులు

చంద్రగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ హక్కులు సాధించుకోవడం కోసం బీసీలందరూ సంఘటితం కావాలని బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టా భాస్కర్ యాదవ్ పిలుపు నిచ్చారు. ఆదివారం చంద్రగిరిలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చంద్రగిరి నియోజకవర్గ స్థాయి కార్యవర్గ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల ఉల్లంఘనపై బీసీలు సమైక్యతతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సమాజంలో సామాజిక బీసీల హక్కుల ఉల్లంఘనపై ఐక్యతతో మనకున్న హక్కులను కాపాడుకోవాలన్నారు. బీసీఈఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు తలారి గోపాల్ మాట్లాడుతూ సమాజంలో బీసీలపై జరుగుతున్న కుట్రలను అడ్డుకోవాలని.. బీసీ హక్కులను భవిష్యత్తు తరాలకు అందించడం బీసీల బాధ్యతన్నారు. ఏపీ టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగావకాశాల పరీక్షల వార్షిక క్యాలెండర్లను నిరంతరం అందించడంతో భవిష్యత్తులో జాతీయస్థాయి అధికారులుగా బీసీల పిల్లలు ఉండే అవకాశం ఉందని వివరించారు. చంద్రగిరి నియోజకవర్గ బీసీఈఎఫ్ కన్వీనర్‌గా మునిశేఖర్, చంద్రగిరి మండలానికి సి.హెచ్. ఈశ్వరయ్య, ఎర్రావారిపాలెం మండలానికి ఎమ్.వెంకటరమణను కోకన్వీనర్‌గా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా గణేష్, గిరిశ్రీనివాస్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో బీసీఈఎఫ్ తిరుపతి జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వంకీపురం పవన్, తిరుపతి ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీ డీన్ వీరబ్రహ్మం, గాండ్ల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకాటి హరికృష్ణ, బీసీ ఉద్యోగ నాయకులు పుట్టపర్తి నాగేసం, ఎంబీసీ రాష్ట్ర నాయకుడు ధర్మాచారి, కొరుటూరు సురేష్, మహంకాళి హరికృష్ణ, చెరుకుపల్లి ఈశ్వరయ్య, శ్రావణ్ కుమార్, శేఖర్, భాస్కర్, జనార్దన్, నియోజకవర్గంలోని బీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

64 కుటుంబాలకు బియ్యం పంపిణీ


బియ్యం పంపిణీ చేస్తున్న సర్పంచ్ ధర్మారెడ్డి

చంద్రగిరి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగుడుపల్లెలో ఈనెలకు సంబంధించిన రేషన్ సరుకులు పంపిణీ చేయకపోవడంతో స్థానిక సర్పంచ్ బోడిరెడ్డి ధర్మారెడ్డి గ్రామంలో 65 దళిత కుటుంబాలకు సొంత ఖర్చులతో ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున బియ్యం సరఫరా చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ బోడిరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో ప్రతినెలా ఒకటో తేదీ నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారని. రేషన్ షాపు డీలర్‌పై ఫిర్యాదులు వెళ్లడంతో ఈనెలకు రావాల్సిన బియ్యం ఇంతవరకు రాలేదని తెలిపారు. అయితే దళితవాడల్లోని పలు కుటుంబాలు బియ్యం వేయలేదని తనను సంప్రదించారని.. దీనిపై రెవెన్యూ అధికా రులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని.. నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సొంత ఖర్చుతో దళితవాడల్లోని 64 కుటుంబాలకు 10 కిలోల బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు స్పందించి నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు.

సభ్యత్వ నమోదులో లక్ష్యాలు సాధించాలి


చిట్టేచర్లలో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

భాకరాపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో పార్టీ అధినాయకత్వం ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బెల్లంకొండ మురళీ అన్నారు. ఆదివారం చిట్టేచర్ల పంచాయతీలో 1,050 సభ్యత్వాలు పూర్తి చేయడంతో కేక్ కోసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని పంచాయతీల్లో లక్ష్యాలు పూర్తి కాలేదని.. వారందరూ సభ్యత్వాలపై దృష్టి పెట్టి పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగచెంగ మనాయుడు, నాయకులు సహదేవరెడ్డి, చంద్రశేఖరరెడ్డి, చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ లీకేజీ


రహదారిపై లీకేజీ అవుతున్న పైపులైన్

రామచంద్రాపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గత పది రోజుల క్రితం నెత్తకుప్పం తాగునీటి ట్యాంకు నుంచి పార్వతీపురం గ్రామానికి వెళ్లే పైపులైను పగిలిపోయింది. తాగునీరు వృథాగా పోతుండటంతోపాటు పగిలిన చోట గుంత ఏర్పడింది. గుంతలోని నీరు తిరిగి పైపులోకి వెళుతోంది. దీంతో తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు తాగునీటి పైపులైను లీకేజీని అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మైండ్‌గేమ్ రాజకీయాలను మానుకోండి


మాట్లాడుతున్న ఈశ్వర్‌రెడ్డి, కూటమి నేతలు

తిరుపతి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పుడు రాతలు రాయించడం, మైండ్‌గేమ్ రాజకీయాలు ఆడటం మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని, ఇకనైనా వాటిని మానుకోవాలని టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి అన్నారు. తనపల్లె రఘునాథ రీసార్ట్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కూటమి పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానిక సమస్యలపై చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని మర్యాద పూర్వకంగా కలిసిన కొందరి సర్పంచులను మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన ఇంటికి పిలిపించుకుని సర్పంచ్ విధులకు ఆటంకం కలిగిస్తే ఉద్యమిస్తానని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పంచాయతీ కార్యదర్శులతో సర్పంచులను బెదిరిస్తు న్నామని.. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో అసత్య ఆరోపణలు చేయడం మంచిదికాదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక ప్రభుత్వాలకు అధికారాలు ఉండాలని కూటమి ప్రభుత్వం కోరుకుంటుందని.. ఆ దిశగా పంచాయతీల్లో అభివృద్ధి పనులను చేపడుతున్నామని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను పక్కదారిపట్టించి సర్పంచులకు ఎలాంటి అధికారాలు లేకుండా చేశారని.. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే నాని చొరవతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో పంచాయతీల్లో అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని గుర్తు చేశారు. అభివృద్ధికి నిర్వచనం చెబుతున్న ఎమ్మెల్యే నానిపై బురదచల్లడం మానుకోకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గణపతినాయుడు, నాయకులు అమిలినేని మధు, సునీల్‌చౌదరి, కృష్ణమూర్తిరెడ్డి, మధుశేఖర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించింది. రూ.3.54 కోట్లు లభించినట్టు ఆదివారం ఉదయం ప్రకటించింది. శనివారం 78,569 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,193 మంది తలనీలాలు సమర్పించారు.





యువతలో ఉత్సాహం నింపేందుకే..!

● 'వి రన్ ఫర్ తిరుపతి' కార్యక్రమమన్న శాప్ చైర్మన్



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): యువతలో ఉత్సాహం నింపేందుకే వి రన్ ఫర్ తిరుపతి కార్యక్రమం నిర్వహించినట్లు శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరై 10కే రన్ ప్రారంభించిన ఆయన యువతతో కలిసి పరుగులో పాల్గొన్నారు. తిరుపతిని ఆధ్యాత్మిక, విద్యా, సాంస్కృతికం రంగాల్లోనే గాక క్రీడా రాజధానిగా నిలిపేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేలాదిగా యువత తరలిరావడం ఆనందంగా ఉందన్నారు. యువత క్రమశిక్షణతో మెలుగుతూ డ్రగ్స్‌కు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. ఇలాంటి కార్యక్రమాలు యువత, విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు రేకెత్తిస్తాయని, తద్వారా వారి అభ్యున్నతికి తోడ్పడతాయని ఎస్వీయూ వీసీ ఆచార్య అప్పారావు అన్నారు. సేటు నో డ్రగ్స్ నినాదం చేస్తూ ఆరోగ్యం మెరుగుపరిచే కార్యక్రమాల పట్ల మొగ్గుచూపాలని ఈగల్ ఎస్పీ నగేష్ తెలిపారు. మహిళలు ఎలాంటి కార్యక్రమాల్లోనైనా రాణించి విజయం సాధిస్తారని నిరూపించేందుకే పరుగు పందెం నిర్వహించామని నిర్వాహకురాలు సజ్జ రాగవీణ స్పష్టం చేశారు. రఫిక్ ప్రాక్టాతో బిగ్‌బాస్ ఫేమ్ కిరాక్‌సీత, నేహాచౌదరీల డ్యాన్సులతో కుర్రకారును ఉర్రూతలూగించింది. పరుగుపందెంలో పాల్గొన్న యువతకు ఎస్‌బీటీ మెడికేర్ ఎండీ లోకేశ్ చౌదరి ఆధ్వర్యంలో ఎనర్జీ డ్రింక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, అదనపు ఎస్పీ రవిమనోహరాచారి, డీఎస్పీ వెంకటనారాయణ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ, ఆరణి శివ, ఎస్వీయూ సీఐ రామయ్య మహేంద్రచౌదరి, వివేక్, తేజారెడ్డి, రంజిత, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



విజేతల వివరాలు

10కే రన్‌లో అఫాన్, సమ్రీన్(ప్రథమ), బ్రహ్మారెడ్డి, దేవరకొండ త్రివేణి(ద్వితీయ), అనిల్, క్షీరసాగర రామస్మిత (తృతీయ) స్థానాలను దక్కించుకోగా ఎస్పీ సుబ్బరాయుడు, శాప్ చైర్మన్ రవినాయుడు పతకాలు, నగదు బహుమతులు అందజేశారు.

తల్లిదండ్రులు మందలించారని..!

● ఇంటి నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు
● గంటల వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు


విద్యార్థులను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి వెళ్లిపోయిన ముగ్గురు విద్యార్థులను గంటల వ్యవధిలోనే పోలీసులు గుర్తించారు. ములకలచెరువు నుంచి వారిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి ఎంజీ కట్టకు చెందిన రవిశంకరాచ్చారి, కె.పవన్, వివేకానంద వీధికి చెందిన రాణాప్రతాప్ స్థానిక టాటా నగర్‌లోని ఓ ప్రైవేటు స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నారు. ఈ ముగ్గురూ మంచి మిత్రులు. చదువులో వెనుకబాటు తనం, క్రమశిక్షణ లేదని వారి తల్లితండ్రులు గట్టిగా మందలించారు. దీంతో ఎట్టైనా వెళ్లిపోవాలని ఈ ముగ్గురు విద్యార్థులు నిర్ణయించుకున్నారు. శనివారం మధ్యాహ్నం స్కూలు నుంచి రైల్వే స్టేషన్‌కు వచ్చారు. పక్కన ఒకరి వద్ద రవిశంకరాచ్చారి సెల్‌ఫోను తీసుకుని తన తల్లితండ్రులకు ఫోనుచేసి తాము వెళ్ళిపోతున్నామని చెప్పారు. ఆ తర్వాత ముగ్గురూ రైలు ఎక్కేశారు. దీంతో కంగారుపడిన తల్లితండ్రులు వెంటనే రైల్వే స్టేషన్ మొత్తం గాలించారు. ఫలితం లేకపోవడంతో తిరుపతి ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

ఆచూకీ దొరికిందిలా

డీఎస్పీ వెంకటనారాయణ పర్యవేక్షణలో ఈస్ట్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బందితో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఫొటోలను అన్ని వాట్సప్ గ్రూపుల్లో పంపారు. వారు ధర్మవరం రైలు ఎక్కి వెళ్ళి ఉంటారనే అనుమానంతో అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, రాయచోటి, ములకలచెరువు పోలీసులను సీఐ రామకృష్ణ అప్రమత్తం చేశారు. రైలు ఎక్కి వెళుతున్న ముగ్గురు విద్యార్థుల వద్ద డబ్బులు లేకపోవడంతో వారు ములకలచెరువు రైల్వే స్టేషన్‌లో దిగి ఉండిపోయారు. అక్కడి పోలీసులు రైల్వే స్టేషన్‌లో రాత్రి పూట తనిఖీ చేస్తుండగా ఈ ముగ్గురు విద్యార్థులు కనపడ్డారు. వారిని విచారించగా తిరుపతి నుంచి పారిపోయి వచ్చామని చెప్పడంతో ఈస్ట్ సీఐకి సమాచారం ఇచ్చారు. ప్రత్యేక బృందాలను ములకలచెరువుకు పంపి ఆ విద్యార్థులను తిరుపతికి తీసుకొచ్చారు.



తిరుమలను మరింత సుందరంగా తీర్చిదిద్దండి

● టీటీడీ చైర్మన్‌తో కంచి కామకోటి పీఠాధిపతి

తిరుమల, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమలను మరింత సుందర దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దాలని, వేదవిద్య వ్యాప్తికి కృషి చేయాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి సూచించారు. కంచి కామకోటి పీఠాధిపతిని టీటీడీ చైర్మన్ ఆదివారం సాయంత్రం తిరుమలలోని కంచిమఠంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ నూతన ధర్మకర్తల మండలి ఇటీవల తీసుకున్న నిర్ణయాలను ఆయన అభినందించారు. తిరుమల పవిత్రతను కాపాడే విధంగా, భక్తులకు మేలు చేకూరేలా నిర్ణయాలు తీసుకోవడం ప్రశంసనీయమని తెలిపారు.

డెయిరీ ఏర్పాటుకు వెయ్యి గోవులిస్తా

బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్

పుంగనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుమల డెయిరీ ఏర్పాటుకు వెయ్యి పశువులతోపాటు 22 ఎకరాల భూమి సేకరించి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్రయావ్ తెలిపారు. ఈమేరకు తాను సీఎం చంద్రబాబుకు లేఖ రాశామన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. టీటీడీ ఆధ్వర్యంలో డెయిరీ ఏర్పాటు చేస్తే తాను 1000 పాడి ఆవులు, మరో లక్ష గోవులు సేకరించే బాధ్యత తీసుకుంటానని గతంలో లేఖ రాసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ఒకేచోట లక్ష గోవులు కుదరకపోతే జిల్లాల వారీగా 5వేల పశువుల చొప్పున ఏర్పాటు చేయవచ్చన్నారు. జిల్లాలోని 22ఎకరాలను టీటీడీ గోశాలకు ఉచితంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో టీటీడీ లడ్డూ తయారీలో కల్తీ జరిగిందని ప్రజలకు అనుమానం కలిగేలా కూటమి ప్రభుత్వం ప్రచారం చేసిందన్నారు. ఆ విషయంపై స్పష్టత ఇవ్వలేదన్నారు.

అయోధ్య విశ్వశాంతి మహాయాగంలో ఈవో

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రపంచశాంతి కోసం ఉత్తరప్రదేశ్ అయోధ్యలో శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ నిర్వహిస్తున్న మహా నారాయణ దివ్య రుద్ర సహిత శతసహస్ర చండీ విశ్వశాంతి మహాయాగంలో ఆదివారం టీటీడీ ఈవో శ్యామలరావు దంపతులు పాల్గొన్నారు. ఈ యాగం నవంబరు 18 నుంచి 45 రోజుల పాటు కొనసాగనుంది. యాగంలో ఈవో దంపతులు పాల్గొన్నారు.

రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తీరని సమస్యలు

పేరుకే జంక్షన్ ● సౌకర్యాలు నిల్ ● ప్రయాణికులకు తప్పని కష్టాలు




రేణిగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ పేరుకే జంక్షన్ కానీ తీరని సమస్యలతో సౌకర్యాలు కరువై ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ రైల్వేస్టేషన్‌కు ఎంతో ఘనచరిత్ర ఉంది. అంచెలంచెలుగా అభివృద్ధి చెందాల్సింది పోయి ఇతర స్టేషన్లతో పోలిస్తే కనీస వసతులు లేవనే చెప్పాలి. దేశం నలుమూలల నుంచి నిత్యం శ్రీవారి భక్తులు ఈ స్టేషన్‌కు అధిక సంఖ్యలో చేరుకుని తిరుమ లేశుడి దర్శనానికి వెళ్తుంటారు. అలాగే తిరుగు ప్రయాణానికి కూడా ఈ స్టేషన్ వద్దకే వస్తు న్నారు. అయితే నిత్యం రైల్వే జీఎం, డీఆర్ఎం స్థాయి అధికారులు ఈ రైల్వేస్టేషన్ పరిశీలనకు వస్తున్నా ఇక్కడి సమస్యలు తీర్చడానికి చొరవ తీసుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తమవుతోంది. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం వద్దనున్న ఎస్కలేటర్ ఆరు నెలలకు పైగా పనిచేయడం లేదు. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా రాక పోకలు సాగించాల్సిన పరిస్థితి. దీనికితోడు ప్లాట్‌ఫాంలపై సూచికబోర్డులు కూడా పనిచే యడం లేదు. వ్యవప్రయాసలు పడి శ్రీవారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణానికి రైల్వే స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. తొలుత ఒకటో నెంబరు ప్లాట్ ఫాంపైకి రైలు వస్తుందని అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రక టిస్తారు. దీంతో ప్రయాణికులు ఆ ప్లాట్ ఫాంకు చేరుకుంటున్నారు. ట్రాఫిక్ కారణాలతో మరో ప్లాట్‌ఫాంపైకి ఆ రైలు చేరుకుంటోంది. దీంతో ఆఖరి నిమిషంలో రైలు మరో ప్లాట్‌ఫాం మీదకు వచ్చిందంటూ అనౌన్స్‌మెంట్ చేస్తుండడంతో ప్రయాణికుల తిప్పలు అన్నీఇన్నీ కావు. లగేజీని తీసుకుని వంతెన మీదుగా చేరుకునే సరికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అలసటకు గురవుతున్నారు. సూచికబోర్డులు లేకపోవడంతో ఏ కోచ్ ఎక్కడ ఉందో తెలియక రిజర్వేషన్ చేసుకున్న ప్రయా ణికుల అవస్థలు వర్ణనాతీతం. ఇప్పటికైనా రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఇక్కడి రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై స్టేషన్ మేనేజరు శేషగిరినాథ రెడ్డిని వివరణ కోరగా... ఎస్కలేటర్ నిర్వహణ కాంట్రాక్టు ముగిసిందని, కొత్తగా టెండర్లు పిలిచామని తెలి పారు. జనవరి నుంచి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్లాట్‌ఫాంపై సూచికబోర్డులు మరమ్మతులకు గురయ్యాయని, ప్రస్తుతం ఆ రిపేరు పనులు జరుగుతున్నాయని త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

సింగిల్ విండోల్లో వడివడిగా కంప్యూటరీకరణ


ఆన్‌లైన్ ప్రక్రియలో నిమగ్నమైన సిబ్బంది

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్‌విండోల) బలోపేతంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. ఆర్థిక లావాదేవీలు, రుణ మంజూర్లు, వ్యాపార నిర్వహణలో అక్రమాలు జరగకుండా పారదర్శకంగా ఉండటానికి సింగిల్ విండోల్లో కంప్యూటరీ కరణ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని 75 విండోల ఆన్‌లైన్ ప్రక్రియలో గత నెలతో తొలి దశ ముగిసింది. మొత్తం 5,04,858 మంది సభ్యులున్నట్లు గుర్తించారు. వీరిలో 3,04,050 మంది పూర్తి వివరాలు సేకరించారు. 2, 3, 4 దశల్లో ప్రీ మైగ్రేషన్, పేరలల్ రన్, గోల్ లైవ్ ప్రక్రియను ఈ నెలాఖరులో పూర్తి చేయనున్నారు. మిగిలిన 2,00,808 మంది సభ్యుల వివరాలు అసమగ్రంగా ఉండటంతో వాటి పరిశీలనను జనవరి నుంచి మూడు నెలల్లో పూర్తి చేయనున్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరిలు రోజువారీ ప్రోగ్రెస్‌ను పర్యవేక్షిస్తున్నారు.

పూర్తయిన ఐదు విండోల ప్రీమైగ్రేషన్ ప్రక్రియ

ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో అగరమంగళం (విజయపురం), అరగొండ (తవణంపల్లె), చెర్లోపల్లె(పుత్తూరు), పరమేశ్వరమంగళం (పుత్తూరు), తిమ్మినాయుడుపాళ్యం (తిరుపతి అర్బన్) సింగిల్ విండోల్లోని సభ్యుల సమగ్ర వివరాలు, అప్‌డేషన్ ప్రక్రియ పూర్తయ్యింది.

ఆన్‌లైన్‌లో సభ్యుల సమగ్ర సమాచారం


సభ్యుల సమగ్ర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. విండోలు ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లింపులు, పెట్టుబడులు, నిల్వ చేసిన డిపాజిట్లు, బకాయిలు, సింగిల్ విండోలు సంవత్సరాల వారీ తయారు చేసిన ఆడిట్ రిపోర్టు ఆధారంగా ప్రాథమికంగా అప్‌డేట్ చేస్తున్నారు. ఈ ప్రక్రియను విండో సీఈవో, సహకార శాఖ ఆడిటర్, బ్యాంకు సూపర్‌వైజర్‌తో కూడిన ప్రీ మైగ్రేషన్ బృందం చేస్తున్నది. నేషనల్ లెవల్ ప్యాక్స్ సాఫ్ట్‌వేర్ వెంచర్ వారిచే ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతుంది.

బ్యాంక్ ఉద్యోగుల అన్నదానం



తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం కపిలతీర్థం వద్ద అన్నదానం చేశారు. కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.విజయభాస్కర్, కె.ధన్వంతకుమార్ మాట్లాడుతూ సామాజిక సేవల్లో భాగంగా తమ కమిటీ కార్తీక మాసం సందర్భంగా ఏడేళ్లుగా కపిలతీర్థం వద్ద అన్నదానం చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు భాస్కర్, జనార్దన్, సుమలత, రేష్మా, నిర్మల, వెంకటలక్ష్మి, మహేష్, కేశవరెడ్డి, యష్మీష్‌బాబు, నటరాజ్, పవన్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపిక



తిరుపతి(క్రీడలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ వింటర్ సబ్ జూనియర్ అండ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన ఏడుగురు ఈత క్రీడాకారులు సత్తాచాటారు. విశాఖపట్నం బీచ్‌రోడ్‌లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శని, ఆదివారాల్లో జరిగిన ఈత పోటీల్లో జిల్లా నుంచి 17మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఏడుగురు అత్యుత్తమంగా రాణించి మెడల్స్ సర్టిఫికెట్స్ పొందారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

విజేతల వివరాలిలా...

పి.వేదశ్రీ ఐదు విభాగాలలో (బంగారు పతకాలు 4, సిల్వర్ 1), ఎస్.మోక్షిత్‌రెడ్డి నాలుగు విభాగాలలో (బంగారు 3, బ్రాంజ్ 1), ఎస్.కేతనరెడ్డి ఐదు విభాగాలలో (బంగారం 3, సిల్వర్ 1, బ్రాంజ్ 1), ఎస్.హేమసాగర్ మూడు విభాగాలలో(సిల్వర్ 2, బ్రాంజ్ 1), ఎస్.జ్యోస్నిత రెండు విభాగాలలో(సిల్వర్ 1, బ్రాంజ్ 1), గీతనిత్యశ్రీ ఓ విభాగంలో (బ్రాంజ్ 1), ఛిసమ్‌కోర(వాటర్‌పోలో ప్రథమస్థానం).

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పదిమంది విద్యార్థులకు వెలమ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. కైలాసకోనలో ఆదివారం జరిగిన కార్తీక వన మహోత్సవంలో ట్రాన్స్‌కో అడిషనల్ ఎస్సీ కె.జనార్దన్‌నాయుడు, ప్రముఖ ఆడిటర్ రామచంద్రరావు హాజరై విద్యార్థులను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు రంగినేని గోపాల్‌నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువుల్లో రాణించినప్పుడే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

ఘనంగా కార్తీక వనభోజనం



కార్తీకవన మహోత్సవంలో పాల్గొన్న అనంతవీధి సభ్యులు

తిరుపతి (లీలామహల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అనంతవీధి వాసుల ఆధ్వర్యంలో ఆదివారం రామాపురం గ్రామం వద్ద కార్తీక వనభోజన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మొదటిసారి చేపట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని, ఏటా చేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆముదాల తులసీరామ్, బలిజ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, అనంతసత్య, ఆముదాల గిరి, పెట్టెం ప్రకాష్, విజయభాస్కర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

12న చక్రతీర్థ ముక్కోటి

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 12వ తేదీన చక్రతీర్థ ముక్కోటి నిర్వహించనున్నారు. ఏటా కార్తీక మాసం శుద్ధద్వాదశి రోజున చక్రతీర్థ ముక్కోటి నిర్వహించడం ఆనవాయితీ. ఆ రోజున స్వామి వారికి ఉదయం, మధ్యాహ్నం ఆరాధనలు పూర్తిచేసిన తర్వాత మంగళవాయిద్యాలతో స్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా చక్రతీర్థానికి వెళతారు. అక్కడ వెలసి ఉన్న చక్రత్తాళ్వారు, నరసింహస్వామికి, ఆంజనేయస్వామికి అభిషేకం, పుష్పాలంకారం, ఆరాధన చేస్తారు. హారతి నివేదించిన అనంతరం తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు. వరాహ పురాణ నేపథ్యంలో తిరుమల శేషగిరుల్లో వెలసి ఉన్న 66 కోట్ల తీర్థాల్లో అత్యంత ముఖ్యమైన సప్తతీర్థాల్లో చక్రతీర్థం ఒకటిగా భాసిల్లుతోంది.

అలరించిన నృత్య ప్రదర్శన!



తిరుచానూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యం నృత్యరూపకం అలరించింది. తిరుపతికి చెందిన పుష్ప నృత్యాలయం వారు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు దాన్విక, చెర్విత, ధన్యశ్రీ, మోక్షజ్ఞ, హన్విత, భవ్య, బషిక, తక్షక, లితిక, మోక్షిత తదితరులు పలు కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.



మార్కెట్లో పారిశుధ్య లోపం



దుకాణాల సమీపంలో నిలిచిన మురుగు నీరు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో పారిశుధ్యం పూర్తిగా లోపించింది. దుకాణాల సమీపంలో నీటి నిల్వలు చేరడం, మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కూరగాయల వ్యర్థాలు కుళ్లి అడుగుపెట్టలేని స్థితికి చేరాయి. వినియోగదారులు ముక్కులు మూసుకుని కూరగాయలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రోజువారీ పరిశుభ్రత పనులు సరిగా చేపట్టడం లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

లడ్డూ కౌంటర్లో అదనపు ఈఓ తనిఖీలు



తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలోని లడ్డూ కౌంటర్‌లో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. టోకెన్ల స్కానింగ్‌తో పాటు భక్తులకు లడ్డూలు జారీ చేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. కొందరు భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. లడ్డూలు ఎలా ఉన్నాయి.. వాటిని పొందే ప్రక్రియలో ఏవైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. లడ్డూల రుచి, నాణ్యత పెరగడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవో లోకనాథం పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



రవినాయుడును సన్మానిస్తున్న వీసీలు విజయభాస్కరరావు, దొరస్వామి, రిజిస్ట్రార్ భూపతినాయుడు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా చేపట్టిన జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. సెనేట్ హాల్లో ఆదివారం నిర్వహించిన సమాపనోత్సవంలో రవినాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గ్రంథాలయాల అభివృద్ధిపై మంత్రి నారా లోకేష్‌తో మాట్లాడతానని తెలిపారు. వర్సిటీ లైబ్రరీ సైన్స్ పూర్వ విద్యార్థి అయిన రవినాయుడును విక్రమ సింహపురి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ద్రవిడ వర్సిటీ ఇన్ చార్జి వీసీ దొరస్వామి, ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, సదస్సు డైరెక్టర్ కొంగర సురేంద్రబాబు నాయుడు సత్కరించారు. ప్రతినిధులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్లు డాక్టర్ సాధు రంగనాథం, డాక్టర్ కిషోర్, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

చెన్నారెడ్డి కాలనీలో.. మందుబాబుల హల్‌చల్

- రెండు నెలల్లో మూడు ఘటనలు
- పోలీసులకు సవాల్ విసురుతున్న రౌడీ గ్యాంగ్‌లు



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెన్నారెడ్డికాలనీ, శింగాలగుంట, శ్మశానం, రయా సర్కిల్ ప్రాంతాలు మందుబాబుల అడ్డాగా మారిపోయాయి. మద్యం మత్తులో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో మూడు ఘటనలు చోటు చేసుకున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తాజాగా గురువారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత చెన్నారెడ్డి కాలనీలోని సెట్విన్ కార్యాలయ సమీపంలో గల బంకు యజమానితో గొడవ పెట్టుకోవడమేగాక దాడికి పాల్పడ్డారు. సిగరెట్ కోసం నవీన్ స్నేహితులతో కలసి బంకు వద్దకు వెళ్లాడు. సిగరెట్ తీసుకుని చిల్లర ఇవ్వలేదు. బంకు యజమాని అనిల్‌కుమార్ డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అప్పటికే మద్యం మత్తులో ఉన్న నవీన్, అతని అనుచరులు అనిల్ కుమార్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో అతనికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఇది మచ్చుకు ఒక ఘటన మాత్రమే. గతంలో ఇద్దరు రౌడీలు ఒక మహిళపై దాడికి దిగిన ఘటన చోటు చేసుకుంది. కొందరు ఆకతాయిలు మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం, వారిని అవమానంగా మాట్లాడడం నిత్యకృత్యంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ చెన్నారెడ్డి కాలనీలో ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే కార్యక్రమంలోనూ స్టేజిపై కూర్చున్న కూటమి నాయకులు ఇద్దరు మందుబాబులను స్టేజిపైకి అనుమతించలేదని రచ్చ చేశారు. పోలీసులు, అధికారులు, మీడియా ఉన్నప్పటికీ భయపడకుండా ఇష్టమొచ్చినట్లు ప్రవర్తించారు. పోలీసులు దీనిపై దృష్టి సారించాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై సీఐ రాంకిశోర్ మాట్లాడుతూ చెన్నారెడ్డి కాలనీలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రకృతిని కళ్ల ముందు పరచిన కవిత్వం

వెలుగుపూల కోసం కవితా సంపుటి ఆవిష్కరణ సభలో వక్తలు



పుస్తకావిష్కరణ చేస్తున్న దామోదరనాయుడు, రామచంద్రారెడ్డి, శ్రీమన్నారాయణ, మురళి, గంగాధరప్రసాద్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలుగు పూల కోసం కవితా సంపుటి ప్రకృతిని కళ్ల ముందు పరచిందని వక్తలు పేర్కొన్నారు. విశ్వశ్రీ సాహిత్య సమాఖ్య ఆధ్వర్యంలో తిరుపతిలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ఆదివారం వెలుగుపూల కోసం కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య గార్లపాటి దామోదరనాయుడు, తమటం రామచంద్రారెడ్డి, నాదెండ్ల శ్రీమన్నారాయణ, ఆముదాల మురళి, మన్నవ గంగాధర ప్రసాద్ మాట్లాడారు. సమాజాన్ని చైతన్యం చేసే విధంగా ఈ పుస్తకంలో కవి రమేష్‌బాబు కవిత్వాన్ని సృజించారని అన్నారు. ప్రకృతిలోని వివిధ అంశాలను కళ్ల ముందు ప్రదర్శించేంతటి సజీవంగా ఇందులో కవిత్వం ఉందన్నారు. సాకం నాగరాజ, ఆకుల మల్లేశ్వరరావు, ఏనుగు అంకమనాయుడు, తోట వెంకటేశ్వర్లు, పేరూరు బాలసుబ్రమణ్యం, తిరువాయిపాటి రాజగోపాల్, మౌని, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

బెంగాల్ సామాజిక జీవన చిత్రం.. శరత్ సాహిత్యం



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ శ్రీధర్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బెంగాల్ సామాజిక జీవన చిత్రాన్ని తన నవలల్లో శరత్‌చంద్ర ముఖర్జీ చిత్రించారని ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ సంస్థ (సీపీడీఆర్ఎస్) జాతీయ కన్వీనర్ ప్రొఫెసర్ శ్రీధర్ పేర్కొన్నారు. శరత్ రాసిన భారతి నవలపై పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం తిరుపతిలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాట కాలం నాటి స్థితిగతులను భారతి నవల ద్వారా శరత్ చిత్రించారని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమకారుల ఆలోచనా తీరును చిత్రించడంతో పాటు వారి ఆలోచనలను ప్రభావితం చేసిన గొప్ప రచయిత శరత్ అని కొనియాడారు. 1907లో శరత్ రాసిన నవలను బ్రిటీషు ప్రభుత్వం నిషేధించిందని సీనియర్ జర్నలిస్టు రాఘవశర్మ అన్నారు. పౌర చైతన్య వేదిక అధ్యక్షుడు వాకా ప్రసాద్, ఏఎస్ పరమేశ్వరరావు, సాకం నాగరాజ, హరీష్ పాల్గొన్నారు.

చర్మకార సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు కాటయ్య

తిరుపతి(వైద్యం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చర్మకార సేవా సంఘం సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పైడికత్తుల కాటయ్య, ఉపాధ్యక్షుడిగా మున్నంగి బాబు, కార్యదర్శిగా పైడికత్తుల చిన్నకాటయ్య, కోశాధికారిగా ఆదూరు దిలీప్, సంయుక్త కార్యదర్శిగా యాసరపు బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని చర్మకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

భగవద్గీత కంఠస్థ పోటీలు



భగవద్గీత పోటీల్లో విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతి సందర్భంగా హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిరంలో ఆదివారం భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. తిరుపతిలోని పలు విద్యాసంస్థలకు చెందిన 139 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని భగవద్గీతలోని శ్లోకాలను రాగయుక్తంగా, అర్థవంతంగా వివరించారు. 6, 7వ తరగతి కేటగిరిలో స్వాతి, భూమి, సహస్ర మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. 8, 9వ తరగతి కేటగిరిలో నందిని, నాగమల్లేశ్వరి, వైష్ణవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 18 ఏళ్ల పైబడిన వారి కేటగిరిలో లక్ష్మీదేవి, జ్యోతి, హేమవెంకటనారాయణ గెలుపొందారు. వీరికి ఈనెల 11వ తేదీ బహుమతులు ప్రదానం చేస్తారు.

వ్యభిచారం కేసులో ఇద్దరి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేకాలనీలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరిని తిరుపతి ఈస్ట్ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు. వారి నుంచి రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. చిత్తూరు జిల్లా అరగొండ మండలం పల్లిచెరువు గ్రామానికి చెందిన మద్దిల అలివేలుమంగమ్మ ఎర్రమిట్టలో ఉంటున్నారు. నెల్లూరు జిల్లా మర్రిపాడుకు చెందిన ముంగల శ్రీరాములు ఓటేరు టెలిఫోన్ కాలనీలో ఉంటున్నారు. వీరు రైల్వే కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఎవరికీ తెలియకుండా కొంతకాలంగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. రహస్య సమాచారం మేరకు ఈస్ట్ సీఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. అలివేలు మంగమ్మ, శ్రీరాములును అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకుని, అరెస్టు చేశారు. న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

అ'పూర్వ' కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 2001-04 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు ఆదివారం సమావేశమయ్యారు. కాలేజీ, హాస్టల్ ప్రాంగణాన్ని కలియదిరిగారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల తర్వాత కలుసుకోవడం పట్ల పరస్పరం సంతోషం వ్యక్తం చేశారు. ఏటా సమావేశం కావాలని, నాటి గురువులను సన్మానించాలని, కాలేజీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. 30 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ పక్కాగా తెలిసి ఉంటేనే పాస్

తిరుపతిలో అడ్వాన్స్డ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ ● ఈ నెలాఖరుకల్లా అందుబాటులోకి..





సిద్ధమవుతున్న అడ్వాన్స్డ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్, ట్రాక్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీటీవో మురళీమోహన్

తిరుపతి (రవాణా), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి ఆర్టీఏ కార్యాలయంలో అడ్వాన్స్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ సిద్ధమవుతోంది. ఇదివరకు ఉన్న ట్రాక్‌లోనే ఈ ఆటోమేటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ ట్రాక్‌లో డ్రైవింగ్ చేయాలంటే పక్కాగా డ్రైవింగ్ తెలిసి ఉండాలి. లేకపోతే ఆటోమేటిక్‌గా ఫెయిల్ అవుతారు. ఇప్పటి వరకు చిత్తూరు, అనంతపురంలో మాత్రమే ఈ డ్రైవింగ్ ట్రాక్ అందుబాటులో ఉండేది. ప్రస్తుతం తిరుపతి, నెల్లూరులో అందుబాటులోకి తెస్తున్నారు. ట్రాక్ చుట్టూ సెన్సార్ అలర్ట్‌ను ఏర్పాటు చేసి ఉంటారు. వాహనం సెన్సార్ అలర్ట్‌కు ఏ మాత్రం టచ్ అయినా కూడా ఆటోమేటిగా ఫెయిల్ అవుతారు. ఒకవేళ ఆ సెన్సార్ అలర్ట్‌ను డ్యామేజ్ చేస్తే డ్రైవింగ్ చేసే వ్యక్తి రూ.3వేలు రవాణా శాఖకు చెల్లించాల్సిందే.

- డ్రైవింగ్ ట్రాక్‌లో పాటించాల్సిన నియమాలు
- ముందుగా ఎల్ఎల్ఆర్ నంబరు స్క్రీన్‌లో చూపించి టోకెన్ పొందాలి.
- తదుపరి బయోమెట్రిక్ పూర్తయిన అనంతరం రేడియో ఫ్రీక్వెన్సీ ట్యాగ్‌ను తీసుకోవాలి.



రేడియో ఫ్రీక్వెన్సీ ట్యాగ్

- ఫోర్ వీలర్‌కి మాత్రం డ్రైవింగ్ సీటు డోర్‌కు రేడియో ఫ్రీక్వెన్సీ ట్యాగ్‌ను అమర్చుతారు. ఇది ఆటోమేటిక్‌గా రెడ్ సిగ్నల్ ఉన్న చోట సెన్సార్‌తో ముడిపడి ఉంటుంది. గ్రీన్ సిగ్నల్ పడిన వెంటనే ముందుకు వెళ్లాలి.
- ట్రాక్‌లోకి ప్రవేశించి వెళుతున్న సమయంలో రెడ్ సిగ్నల్ వస్తుంది. అప్పుడు అక్కడే ఉన్న సెన్సార్‌కు ట్యాగ్‌ను చూపితే గ్రీన్ సిగ్నల్ పడుతుంది. తర్వాత అక్కడి నుంచి ముందుకు డ్రైవ్ చేసుకుని వెళ్లాల్సి ఉంటుంది.
- ఇలా రెడ్ సిగ్నల్ ఉన్న ప్రతిచోటా ఈ ట్యాగ్‌ను సెన్సార్‌కు చూపించి ముందుకు వెళ్లాలి.
- ట్యాగ్‌ను సెన్సార్‌కు చూపకుండా రెడ్ సిగ్నల్ దాటితే ఆటోమేటిగ్గా ఫెయిల్ అవుతారు.
- డ్రైవింగ్ పూర్తి చేసి ట్రాక్ నుంచి బయటకు వచ్చే సమయంలో వైట్‌లైన్ ఉంటుంది. అక్కడ ఆగి స్టాప్ సిగ్నల్ చూపించి బయటకు రావాలి.
- ఇలా ప్రతి రెడ్ సిగ్నల్ దగ్గర ఆగితే సెన్సార్ కనెక్ట్ అయిన వెంటనే గ్రీన్ సిగ్నల్ పడుతుంది.
- ట్రాక్‌లో డ్రైవింగ్ పూర్తయిన అనంతరం వైట్‌లైన్ వద్ద ఆగి స్టాప్ సిగ్నల్ చూపిన అనంతరం బయటకు రావాలి.

ట్రాక్‌లో డ్రైవింగ్ పక్కాగా తెలియాల్సిందే..

అడ్వాన్స్డ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌కు అనుగుణంగా టెస్ట్‌కు హాజరయ్యే ప్రతి అభ్యర్థి కూడా పక్కాగా డ్రైవింగ్ చేయాల్సిందే. చిన్న తప్పిదాలు చేసినా ఫెయిల్ అవుతారు. ట్రాక్‌లో అభ్యర్థి చేసే డ్రైవింగ్ పూర్తిగా సెన్సార్‌తో ముడిపడి ఉంటుంది. ఈ అధునాతన డ్రైవింగ్ ట్రాక్‌కు సంబంధించి నియమ నిబంధనలను ఆర్టీయే కార్యాలయంలో చిన్న టీవీ స్క్రీన్‌లో అభ్యర్థులు చూడవచ్చు. డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరయ్యే అరగంట ముందు కార్యాలయానికి వస్తే వీటిని వీక్షించవచ్చు. ఈ నెలాఖరులోపు డ్రైవింగ్ ట్రాక్ అందుబాటులోకి వస్తుంది.

- కొర్రపాటి మురళీమోహన్,
జిల్లా రవాణా శాఖ అధికారి

క్రీడాకారులు ఒలంపిక్స్ స్థాయికి ఎదగాలి



ఆర్చరీ క్రీడాకారులతో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరుకు చెందిన ఆర్చరీ క్రీడాకారులు ఒలంపిక్స్ స్థాయికి ఎదగాలని, అందుకు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఏపీరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్చరీలో జాతీయస్థాయిలో ప్రతిభచాటిన క్రీడాకారులకు మెమెంటోలు, ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థికి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గూడూరుకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు హాకీలో జాతీయస్థాయిలో, క్రికెట్‌లో రాష్ట్రస్థాయిలో రాణించారన్నారు. ప్రస్తుతం ఆర్చరీలో జాతీయస్థాయిలో రాణించడం శుభపరిణామమన్నారు. పట్టణానికి చెందిన క్రీడాకారుడు తరునీష్ జత్య ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి ఆర్చరీ పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించడం పట్టణానికి గర్వకారణమన్నారు. గోల్డ్‌మెడల్ సాధించిన తరునీష్ జత్యకు రూ.30వేలు, అతనికి తర్ఫీదు ఇచ్చిన కోచ్ శంకర్‌కు రూ.20వేలు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేశానన్నారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్ర ప్రసాద్, వసంత్‌కుమార్, బెజవాడ రమేష్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, దీపక్ ఆకాష్, లవకుమార్, చిరంజీవి, పురుషోత్తం, మునీఫ్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయండి



డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ డిపోలో అక్రమంగా సస్పెండ్ చేసిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ రిజనల్ అధ్యక్షుడు మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం డిపో వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌డబ్ల్యుఎఫ్ యూనియన్ సభ్యుల పట్ల అధికారులు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి విడనాడాలన్నారు. డ్రైవర్లు, కండక్టర్లను డిపో మేనేజర్ అక్రమంగా సస్పెండ్ చేయడం మంచిపద్ధతి కాదన్నారు. ఏకపక్షంగా వ్యవహరించడం, ఉద్దేశపూర్వకంగా విధుల నుంచి సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, శేషయ్య కిరణ్, కృష్ణ, రఘురామ్, సుబ్రహ్మణ్యం, రమణయ్య, ఎంఎస్ వాసులు, భాస్కర్, కృష్ణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌కు లిఫ్ట్ మంజూరు



ఎంపీ గురుమూర్తిని సత్కరిస్తున్న రైల్వే ప్రాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

నాయుడుపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌కు లిఫ్ట్ మంజూరైనట్లు సదరన్ రైల్వే ప్రాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మస్తాన్ ఆదివారం తెలిపారు. రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ లేకపోవడంతో వృద్ధులు, వికలాంగులు, చిన్నారులు ప్లాట్‌ఫాం మారేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని తిరుపతి ఎంపీ గురుమూర్తి దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన సదరన్ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి లిఫ్ట్ మంజూరు చేయించారని తెలిపారు. ఆదివారం ఎంపీ గురుమూర్తిని నాయుడుపేట సదరన్ రైల్వే ప్రాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కిరాణాషాపు దగ్ధం



కాలిపోయిన దుకాణంలోని వస్తువులు

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూపిలిపాళెం గ్రామంలోని షేక్ లతీఫ్‌కు చెందిన కిరాణాషాపు షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు... ఆదివారం ఉదయం దుకాణంలో ఒక్కసారిగా మంటలు చేలరేగడంతో షేక్ లతీఫ్ భయంతో రోడ్డు పైకి పరుగులు తీశాడు. స్థానికులు బిందెలతో నీళ్లు తీసుకువచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. దుకాణంలోని ఫర్నీచర్, ఫ్రీజ్, ఐస్‌క్రీమ్ యూనిట్, కంప్యూటర్, సీసీ కెమెరా, కిరాణ సామానులు కాలిపోయాయి. సుమారు రూ.7 లక్షలు నష్టం వాటిల్లిందని షేక్ లతీఫ్ తెలిపారు.

శిథిలావస్థలో ఎంఈవో కార్యాలయం



పెచ్చులూడిపోతున్న శ్లాబు



తడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే పలుచోట్ల శ్లాబు పెచ్చులూడిపోయి ఇనుక ఊచలు దర్శనమిస్తున్నాయి. మరి కొన్నిచోట్ల ఇప్పుడిప్పుడే పెచ్చులూడి పగుళ్లు కనిపిస్తున్నాయి. గత ఐదేళ్లుగా కార్యాలయంలో చిన్నపాటి వర్షం కురిసినా భవనం ఉరుస్తోంది. దీంతో కార్యాలయ సిబ్బంది భయంభయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎంఈవో కార్యాలయానికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది.

బ్రాహ్మణ సేవా సమాఖ్య కార్యవర్గం ఎంపిక

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాహ్మణ భవనంలో ఆదివారం బ్రాహ్మణ సేవా సమాఖ్య నూతన వర్గాన్ని ఎంపిక చేసినట్లు సమాఖ్య సభ్యులు తెలిపారు. గౌరవాధ్యక్షుడిగా యరగుడిపాటి చలపతిరావు, అధ్యక్షుడిగా ఆనిమెళ్ల శివకుమార్, కార్యదర్శిగా చిట్టమూరు శ్రీనివాసరావు, కోశాధికారిణిగా విద్యలలిత, కార్యవర్గ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడవిలా శ్మశానవాటిక



ముళ్లచెట్లతో నిండిపోయిన శ్మశానం - మూసుకుపోయిన దారి

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలోని చల్లకాలువ సమీపంలో గల శ్మశానవాటిక అడవిలా మారింది. మృతదేహాలను తీసుకువెళ్లే దారి ముళ్లచెట్లతో మూసుకుపోయింది. అంత్యక్రియలు నిర్వహించడానికి కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. పట్టణ పరిధిలోని చల్లకాలువ సమీపంలో హిందూ శ్మశానవాటిక ఏర్పాటు చేశారు. దూర్జటినగర్, బనిగిసాహెబ్‌పేట, జనార్దన రెడ్డి కాలనీ, అశోక్‌నగర్, అరుంధతీయపాళెం తదితర ప్రాంతాలకు చెందిన మృతులకు ఇక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. శ్మశానానికి వెళ్లే మార్గం ముళ్ల చెట్లతో కమ్మేసి ఉండడంతో దారి సౌకర్యం కూడా లేకుండా పోయిందని, అడవిని తలపిస్తుండడంతో మృతదేహాలను ఖననం చేయాలన్నా ఇబ్బందులు పడాల్సివస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా చల్లకాలువ పక్కనే ఉండడంతో వరదల సమయంలో శ్మశాన స్థలం కోతకు గురై కుంచించుకు పోతుందని చెబుతున్నారు. శ్మశానవాటికను అభివృద్ధి చేయడంతో పాటు ప్రహరీ నిర్మించాలని, కాలువ కోతకు గురికాకుండా రివిట్‌మెంట్ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వైద్యాధికారి చొరవతో ఆస్పత్రిలో అభివృద్ధి పనులు



ఆస్పత్రిప్రాంగణంలో మట్టిని లెవల్ చేయిస్తున్న డాక్టర్లు

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుట్టేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు రోజులుగా స్థానిక వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ ఆస్పత్రి గ్రామానికి దూరంగా ఉండటంతో పాటు వసతుల కొరత ఉంది. ఆస్పత్రి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయి విషసర్పాలు, తేళ్లు లోనికి వస్తున్నాయి. స్థానిక వైద్యాధికారి వెంకటరమణ, డాక్టర్ నాగరాజు, వైద్య సిబ్బంది సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టారు. డాక్టర్ వెంకటరమణ తన సొంత నిధులతో ప్రాంగణంలోని పిచ్చి మొక్కలకు ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించి లెవలింగ్ చేయిస్తున్నారు. అలాగే ఆస్పత్రి ప్రహరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అంతేకాకుండా సిబ్బంది సహకారంతో ఆస్పత్రిలో వైద్య పరికరాలను సమకూర్చుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధికి అక్కడ పనిచేసే వైద్యులు, సిబ్బంది తమ సొంత నిధులు వెచ్చించి ఆదర్శంగా నిలుస్తున్నారు.



అమ్మవార్లకు పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న గ్రామస్తులు - చిట్టేడులో మేళతాళాలతో ఊరేగుతున్న గంగపెట్టె

వైభవంగా అంకమ్మ గ్రామోత్సవం

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న చిట్టేటమ్మ, పోలేరమ్మ, కామాక్షమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంకమ్మ గ్రామోత్సవం జరిగింది. గ్రామస్తులు గంగపెట్టె, పోలేరమ్మ ఉత్సవ విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామస్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

వీధుల పేర్లు తెలిపేలా బోర్డుల ఏర్పాటు అభినందనీయం

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీధుల పేర్లను తెలిపేలా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బోర్డులను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక రోటరీ భవన్‌లో వీధుల పేర్లు తెలిపే బోర్డులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు వీధుల పేర్లు తెలుసు కునేలా రోటరీక్లబ్ సభ్యులు బోర్డులను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, డాక్టర్ జనార్ధన రెడ్డి, మునిగిరీష్, దశరధరామిరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, శ్రీధర్ రెడ్డి, జీజీ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక



హ్యాండ్‌బాల్ జట్టుతో పీడీ శిరేష్ తదితరులు

చిల్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఉమ్మడి నెల్లూరు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టును ఆదివారం ఎంపిక చేసినట్లు పీడీ శిరేష్ అన్నారు. ఈనెల 13,14,15 తేదీల్లో అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు జరగనున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో సచివాలయ భవనం



సచివాలయం చుట్టూ పిచ్చి మొక్కలు

పెళ్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి సచివాలయ భవనం చుట్టూ ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో సచివాలయంలోకి పాములు, విష పురుగులు వస్తున్నాయి. ఇటీవల సచివాలయంలోకి వచ్చిన ఓ పామును సిబ్బంది కొట్టి చంపారు. ఇలాంటి ఘటనలతో సచివాలయ ఉద్యోగులు, వివిధ సమస్యలపై వచ్చే ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సచివాలయ ప్రాంగణంలో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి

వాకాడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలపై దృష్టి సారించాలంటూ వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం వాకాడు మండలంలోని తన నివాసంలో రాంకుమార్ రెడ్డి వాకాడు, కోట మండలాల వైసీపీ నాయకులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, నెల్లూరు పెంచల్‌రెడ్డి, వాకాటి రవి, తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్య



కోటయ్య మృతదేహం

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం గ్రామానికి చెందిన మల్లి కోటయ్య (55) ఆదివారం ఉరివేసుకొని మృతి చెందాడు. వెంకన్నపాళెంలోని వడ్డిపాళెం గ్రామానికి చెందిన కోటయ్య వీరారెడ్డిసత్రం సమీపంలోని ఇటుకబట్టీల దగ్గర ఉన్న మామిడితోటలో చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కొడుకు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

చదువులతోనే ఉజ్వల భవిత



సహపంక్తి భోజనం చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

గూడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): చదువులతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక గాంధీనగర్ సమీపంలోని మినీగురుకులం బాలికల పాఠశాలలో టీచర్స్, పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమం ద్వారా విద్యార్థుల సామర్థ్యాలను తల్లిదండ్రులు తెలుసుకునే వీలుంటుందన్నారు. అనంతరం తల్లిదండ్రులకు ముగ్గులు, క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. పాఠశాలలో సహపక్తి భోజనాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రామమోహన్‌రావు, రవీంద్రబాబు, జ్యోతి, మస్తానయ్య, ఉమా తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని నెల్లటూరు ప్రాథమిక పాఠశాలలో టీచర్స్, పేరెంట్స్ సమావేశాన్ని నిర్వహించారు.

కోటమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో కోటమ్మ

కోట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోట గ్రామ దేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన, పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పాలకమండలి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు...

చిల్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టుకుని నైవేద్యం నివేదించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోకవర్గంలో ఏర్పాటు కానున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగావకశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు జనసేన నాయకులు విన్నవించారు. ఆదివారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో జనసేన నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో తీగల చంద్రశేఖర్, మోహన్, భాస్కర్, బాలసుబ్రహ్మణ్యం, శివకుమార్, నవీన్, సాయికిరణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి ఆనంద్ రెడ్డి కోరారు. రైతులు ఈ నెల 15వ తేదీ లోగా ప్రీమియం చెల్లించి బీమా చేసుకోవాలని సూచించారు.

రహదారికి మోక్షమెన్నడో!

చినుకు పడితే నడకా నరకమే

14 గ్రామాల ప్రజలు అవస్థ



జంగాలపల్లి వద్ద గుంతలమయంగా మారిన తారురోడ్డు

పెళ్లకూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని 71వ జాతీయ రహదారిలోని గుర్రప్పతోట నుంచి కప్పగుంటకండ్రిగ మీదుగా పాలచ్చూరు గిరిజన కాలనీ వరకు ఉన్న రోడ్డుకు మోక్షం లభించక 14 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. సుమారు 10 కిలోమీటర్లు ఉన్న ఈ రోడ్డుపై తారు లేచిపోయి మట్టిరోడ్డుగా మారింది. అసలే అంతంత మాత్రంగా ఉన్న రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు మరింత అధ్వానంగా మారడంతో దారిలో నడకకే నరకం మారింది. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులు చేపట్టక పోవడంతో రోడ్డుపై ప్రయాణం చేయాలంటేనే ఒళ్లు గుల్లవుతోందని ప్రజలు వాపోతున్నారు. వాహనాల్లో వెళ్లినా గోతుల్లో పడి ప్రమాదాలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేనకూరు సెజ్‌తో పాటు కప్పగుంటకండ్రిగ, జంగాలపల్లి, పెరుమాళ్లపల్లి, అనకవోలు, పాలచ్చూరు తదితర 14 గ్రామాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు తదితర వాహనాల్లో వందలాది మంది కార్మికులు, రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గుర్రప్పతోట నుంచి కప్పగుంటకండ్రిగ రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సునీత అన్నారు. నాయుడుపేట పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం ఆ సంఘ రాష్ట్ర నాయకులతో కలసి సావనీర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాన్ని గిట్టుబాటు కానీవ్వకుండా చేసిన పాలకుల విధానాలే వ్యవసాయ రంగ సంక్షోభానికి కారణమన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల తయారీని విదేశీ బహుళజాతి కంపెనీలకు కట్టపెట్టడం వల్లే పెట్టుబడులు పెరిగి రైతాంగానికి గిట్టుబాటు కాకుండా పోయిందన్నారు. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని గత మూడేళ్లుగా రైతాంగం ఆందోళన చేస్తున్నా.. మొండి వైఖరితో వ్యవహరిస్తుండటాన్ని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ నాయకుడు లక్ష్మీరెడ్డి, రైతుకూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమణయ్య, సుబ్బరాయుడు, జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, రవీంద్ర, ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

రహదారిని కమ్మేసిన కంపచెట్లు

తరచూ ప్రమాదాలు



చెంబేడు చెరువుకట్ట వద్ద రోడ్డుమీదకు వచ్చిన కంపచెట్లు

పెళ్లకూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెంబేడు నుంచి శ్రీకాళహస్తి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా కంపచెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోయాయి. ముళ్ల కంపలు రోడ్డు మీదకు రావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అదేవిధంగా చెంబేడు నుంచి ఆర్లపాడు గ్రామానికి వెళ్లే దారిలో ఏర్పాటుచేసిన ఆర్లపాడు సూచిక బోర్డును కంపచెట్లు కమ్మేశాయి. అధికారులు స్పందించి కంపచెట్లు తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

అయ్యప్పజ్యోతి మహోత్సవంలో అన్నదానం



నాయుడుపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని అయ్యప్ప స్వామి అఖండజ్యోతి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం అయ్యప్పస్వాములకు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జలదంకి వెంకటకృష్ణారెడ్డి, పెసల కిషోర్‌బాబు, చిరువెళ్ల మునిరాజ, విజియల్ రెడ్డి, జలంధర్, చిట్టేటి అంకయ్య, పెసల రమేష్, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కౌంటర్లో అదనపు ఈవో తనిఖీలు

తిరుమల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని లడ్డూ కౌంటర్‌లో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేశారు. టోకెన్ల స్కానింగ్‌తో పాటు భక్తులకు లడ్డూలు జారీచేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. కొందరు భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలు సేకరించారు. లడ్డూలు ఎలా ఉన్నాయి.. వాటిని పొందే ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ఆరా తీశారు. లడ్డూల రుచి, నాణ్యత పెరగడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నిరుపయోగంగా సత్యవేడు మినీ క్రికెట్ స్టేడియం





ధ్వంసమైన కిటికీ అద్దం

సత్యవేడు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి, వారికి సరైన శిక్షణ ఇచ్చి మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో గతంలో టీడీపీ ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక మినీ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సత్యవేడులో నిర్మించిన మినీ క్రికెట్ స్టేడియం నిరుపయోగంగా మారింది. సత్యవేడు నియోజకవర్గ కేంద్రంలో యువత కోసం బాబు డిగ్రీ కాలేజీ సమీపంలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ2.10 కోట్లు వెచ్చించి అన్ని హంగులతో మినీ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించారు. 2018లో అప్పటి ఎమ్మెల్యే తలారి ఆదిత్య దీన్ని ప్రారంభించారు. స్టేడియంలో వ్యాయాయం చేసుకోవడానికి సంబంధించిన పరికరాలు, షటిల్ కోర్టు, టెన్నిస్ కోర్టు, ఇండోర్ స్టేడియం, పెవిలియన్ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో కొన్నాళ్లు ప్రభుత్వ పర్యవేక్షణలో స్టేడియం నిర్వహణ సజావుగా సాగింది. అనంతరం 2019లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్టేడియం నిర్వహణకు గ్రహణం పట్టింది. మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. సాయంత్రం ఆరు దాటిందంటే సమీప ప్రాంతాల్లోని మందుబాబులు ఇక్కడికి చేరుకుని మద్యం తాగి స్టేడియం ప్రాంగణాన్ని అపరిశుభ్రం చేస్తున్నారు. ఆకతాయిల ఆగడాలకు స్టేడియంలోని గదులకు, కిటీలకు అమర్చిన అద్దాలు పగిలిపోయి, కళావిహీనంగా మారింది. స్టేడియం చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి చిట్టడవిలా మారింది. స్థానిక యువతను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడకారులుగా తయారు కావాల్సిన స్టేడియంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్టేడియంకు శాశ్వత కోచ్‌ను నియమించి, క్రీడల పై యువతకు శిక్షణనిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ క్రీడాకారులు కోరుతున్నారు.

భర్తపై అనుమానంతో భార్య ఆత్మహత్య

రేణిగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భర్తపై అనుమానంతో భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. మండలంలోని కుర్రకాలువ గ్రామానికి చెందిన యోగప్రియ(20) తమిళనాడుకు చెందిన సెల్వంను ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సెల్వం స్థానికంగా కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అయితే సెల్వం మరో మహిళతో చనువుగా ఉండడంపై నిత్యం భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో యోగప్రియ ఉరివేసుకుంది. గమనించిన చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ సుధాకర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దింపారు. అనంతరం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. సెల్వంను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దంపతులపై దాడి: ముగ్గురిపై కేసు నమోదు

ఏర్పేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలకు చెరందిన మునెమ్మ, సుహాసిని కుటుంబాల మధ్య గత కొద్దిరోజులుగా కుటుంబ కలహాలు ఉన్నాయి. దీంతో సుహాషిణి, ఆమె భర్త ధనంజయ, ఆయన తమ్ముడు కృష్ణమూర్తి ఈనెల 6న మునెమ్మ, మునిరెడ్డి దంపతుల ఇంటికెళ్లి దాడి చేశారు. దీంతో మునెమ్మ ఫిర్యాదు మేరకు ఏర్పేడు సీఐ జయచంద్ర విచారించి సుహాసిని, ధనంజయ, కృష్ణమూర్తిపై కేసు నమోదు చేశారు.

జాతీయస్థాయి ఈత పోటీలకు ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ వింటర్ సబ్ జూనియర్ అండ్ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో తిరుపతికి చెందిన ఏడుగురు ఈత క్రీడాకారులు సత్తాచాటారు. విశాఖపట్నం బీచ్‌రోడ్‌లోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శని, ఆదివారాల్లో జరిగిన ఈత పోటీల్లో జిల్లా నుంచి 17మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఏడుగురు అత్యుత్తమంగా రాణించి మెడల్స్, సర్టిఫికెట్స్ పొందారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

విజేతల వివరాలిలా...

పి.వేదశ్రీ ఐదు విభాగాలలో (బంగారు పతకాలు 4, సిల్వర్ 1), ఎన్.మోక్షిత్‌రెడ్డి నాలుగు విభాగాలలో (బంగారు 3, బ్రాంజ్ 1), ఎన్.కేతనరెడ్డి ఐదు విభాగాలలో (బంగారం 3, సిల్వర్ 1, బ్రాంజ్ 1), ఎన్.హేమసాగర్ మూడు విభాగాలలో(సిల్వర్ 2, బ్రాంజ్ 1), ఎన్.జ్యోస్నిత రెండు విభాగాలలో(సిల్వర్ 1, బ్రాంజ్ 1), గీతనిత్యశ్రీ ఓ విభాగంలో (బ్రాంజ్ 1), క్రిసమ్‌కోర(వాటర్‌పోలో ప్రథమస్థానం).

గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. ఎస్వీయూ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా చేపట్టిన జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. సెనేట్ హాల్లో ఆదివారం నిర్వహించిన సమాపనోత్సవంలో రవినాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వర్సిటీ లైబ్రరీ సైన్స్ పూర్వ విద్యార్థి అయిన రవినాయుడును విక్రమసింహపురి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు, ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ దొరస్వామి సత్కరించారు.

పుత్తూరు వార్తలు

నిండుకుండలా వెదళ్ల చెరువు



వడమాలపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో అతి పెద్ద చెరువు, ఆయకట్టు కలిగిన ఓటీఆర్ కండ్రిగ సమీపంలోని వెదళ్ల చెరువు నిండి కలుజు పారుతుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ చెరువు 480 ఎకరాలకు పైగా నీరందిస్తోంది. ఈ చెరువు కలుజు పారితే దిగువనున్న సుమారుగా ఆరు చెరువులు నిండుతాయి. అలాగే పరిసర గ్రామాల్లో భూగర్భ జలాల నీటిమట్టం పెరిగి సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవు. చెరువు కలుజు పారడం, తూముల ద్వారా సాగునీరు పుష్కలంగా వస్తుందని రైతుల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా వెదళ్ల చెరువు మధ్యలో కిలో మీటర్ పొడవున రైలు కట్ట ఉంది. రెండు వైపులా చెరువును ప్రయాణికులు వీక్షిస్తున్నారు.

ప్రమాదాలకు నిలయంగా మలుపు రోడ్లు





రామరాజుకండ్రిగ వద్ద మలుపులు

● కొన్నేళ్లుగా కానరాని జంగిల్ క్లియరెన్స్

వడమాలపేట, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మలుపు రోడ్ల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ఎదురుగా వచ్చే వహనాలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ప్రధాన రహదారి తడుకు ఆర్‌ఎస్ నుంచి సీతారామపురం, అప్పలాయగుంట, రామాపురాలకు వెళ్లే సింగిల్ రోడ్డు మలుపులతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి ముఖ్యంగా తడుకు రైల్వే స్టేషన్ నుంచి సీతారామపురం వరకు 6 కిలోమీటరు ఉన్న రోడ్డులో సుమారుగా ఇరవై ప్రమాదకర మలుపులున్నాయి. దీనికి తోడు గత కొన్నేళ్లుగా రోడ్డు కు ఇరువైపులా ముళ్ల చెట్లను తొలగించకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. తమిళనాడు నుంచి అప్పలాయగుంట మీదుగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తులకు ఈ రోడ్డు దగ్గర దారి. వందలాది మంది గోవింద భక్తులు ఈ రోడ్డు మీదుగా భయం గుప్పిట్లో నడచి వెళ్తున్నారు. దీంతో పాటు కార్లు ఇతర వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు రద్దీ ఎక్కువగా ఉంటుంది. మలుపు రోడ్ల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేవు. రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని ఈ రోడ్డులో మలుపుల వద్ద ప్రమాదాల నివారణ కోసం అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రేణిగుంట రైల్వేస్టేషన్‌లో తీరని సమస్యలు

పేరుకే జంక్షన్ ● సౌకర్యాలు నిల్● ప్రయాణికులకు తప్పని కష్టాలు





రైల్వేస్టేషన్‌లో ఆరునెలలుగా పనిచేయని ఎస్కలేటర్ - మెట్ల మీదుగా ప్లాట్‌ఫాం చేరుకుంటున్న ప్రయాణికులు

రేణిగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ పేరుకే జంక్షన్ కానీ తీరని సమస్యలతో సౌకర్యాలు కరువై ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ఈ రైల్వేస్టేషన్‌కు ఎంతో ఘనచరిత్ర ఉంది. అంచెలంచెలుగా అభివృద్ధి చెందాల్సింది పోయి ఇతర స్టేషన్లతో పోలిస్తే కనీస వసతులు లేవనే చెప్పాలి. దేశం నలుమూలల నుంచి నిత్యం శ్రీవారి భక్తులు ఈ స్టేషన్‌కు అధిక సంఖ్యలో చేరుకుని తిరుమలేశుడి దర్శనానికి వెళ్తుంటారు. అలాగే తిరుగు ప్రయాణానికి కూడా ఈ స్టేషన్ వద్దకే వస్తున్నారు. అయితే నిత్యం రైల్వే జీఎం, డీఆర్‌ఎం స్థాయి అధికారులు ఈ రైల్వేస్టేషన్ పరిశీలనకు వస్తున్నా ఇక్కడి సమస్యలు తీర్చడానికి చొరవ తీసుకోకపోవడం పట్ల నిరసన వ్యక్తమవుతోంది. ఒకటో నెంబరు ప్లాట్‌ఫాం వద్దనున్న ఎస్కలేటర్ ఆరు నెలలకు పైగా పనిచేయడం లేదు. దీంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా రాక పోకలు సాగించాల్సిన పరిస్థితి. దీనికితోడు ప్లాట్‌ఫాంలపై సూచికబోర్డులు కూడా పనిచేయడం లేదు. వ్యవప్రయాసలు పడి శ్రీవారి దర్శనం చేసుకుని తిరుగు ప్రయాణానికి రైల్వేస్టేషన్‌కు వచ్చే ప్రయాణికులకు చుక్కలు కనిపిస్తున్నాయి. తొలుత ఒకటో నెంబరు ప్లాట్ ఫాంపైకి రైలు వస్తుందని అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రకటిస్తారు. దీంతో ప్రయాణికులు ఆ ప్లాట్ ఫాంకు చేరుకుంటున్నారు. ట్రాఫిక్ కారణాలతో మరో ప్లాట్‌ఫాంపైకి ఆ రైలు చేరుకుంటోంది. దీంతో ఆఖరి నిమిషంలో రైలు మరో ప్లాట్‌ఫాం మీదకు వచ్చిందంటూ అనౌన్స్ మెంట్ చేస్తుండడంతో ప్రయాణికుల తిప్పలు అన్నీఇన్నీ కావు. లగేజీని తీసుకుని వంతెన మీదుగా చేరుకునే సరికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అలసటకు గురవుతున్నారు. సూచికబోర్డులు లేకపోవడంతో ఏ కోచ్ ఎక్కడ ఉందో తెలియక రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. ఇప్పటికైనా రైల్వేశాఖ ఉన్నతాధికారులు ఇక్కడి రైల్వేస్టేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై స్టేషన్ మేనేజరు శేషగిరినాథ రెడ్డిని వివరణ కోరగా.. ఎస్కలేటర్ నిర్వహణ కాంట్రాక్టు ముగిసిందని, కొత్తగా టెండర్లు పిలిచామని తెలిపారు. జనవరి నుంచి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్లాట్‌ఫాంపై సూచికబోర్డులు మరమ్మతులకు గురయ్యాయని, ప్రస్తుతం ఆ రిపేరు పనులు జరుగుతున్నాయని త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని వివరించారు.

కంపు.. కంపు

● దుర్గంధ భరితంగా ప్రభుత్వాస్పత్రి రోడ్డు
● ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు, స్థానికులు



ప్రభుత్వాస్పత్రి రోడ్డులో చేపల దుకాణాలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి రోడ్డు చేపల విక్రయాలతో దుర్గంధ భరితంగా మారింది. ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్యతో పాటు కంపు భరించలేక ముక్కులు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇష్టానుసారంగా చేపల అంగళ్లు వెలియడంతో ఈ పరిస్థితి తలెత్తింది. 25 ఏళ్ల క్రితం ఆర్టీసీ బస్టాండు వెనుక అయ్యలనాడు చెరువులో వందపడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని అప్పటి మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి చొరవతో నిర్మించారు. బస్టాండు నుంచి ప్రభుత్వాస్పత్రి వరకు రహదారిని నిర్మించారు. అయితే ఇంత పెద్దరోడ్డు ఎందుకని అందరూ భావించారు. ఆయన దూరదృష్టి ప్రకారమే ఆ రోడ్డులో రాకపోకలు అంతకంతకు పెరిగాయి. ప్రస్తుతం పెద్దఎత్తున ట్రాఫిక్ స్తంభించే స్థాయిలో జన తాకిడి అధికమైంది. ఈ మార్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తుడా కార్యాలయం, ఆర్‌అండ్‌బీ డివిజన్ కార్యాలయం, అతిథి గృహం, అన్న క్యాంటీన్ కూడా ఇక్కడే నిర్మించారు. ఈ మార్గంలో భవన నిర్మాణ, కోళ్ల వ్యర్థాలు చేరకుండా 2014-19 మధ్యకాలంలో మున్సిపల్ అధికారులు కఠినంగా వ్యవహరించారు. 2019లో వైసీపీ పాలనలో ప్రభుత్వాస్పత్రి రోడ్డులో పారిశుధ్యం అటకెక్కింది. చికెన్ దుకాణాల వ్యర్థాలు, పందులకు ప్రభుత్వాస్పత్రి రోడ్డే ఆవాసంగా మారింది. ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు కంటితుడుపు చర్యలు తీసుకునేవారు. ఇక గత వైసీపీ పాలనలో కొందరు చేపల విక్రయదారులకు ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఎదుట, అలాగే అన్న క్యాంటీన్‌కు ఎదురుగా అనుమతించారు. దీంతో మార్గం దుర్గంధంగా మారింది. అలాగే ట్రాఫిక్ సమస్య కూడా ప్రధాన కారణంగా తయారైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ప్రభుత్వాస్పత్రి రోడ్డు ప్రక్షాళనపై దృష్టి సారించారు. అన్న క్యాంటీన్‌కు ఎదురుగా గార్డెన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులను శరవేగంగా సాగుతున్నాయి. త్వరలోనే ఇది ప్రారంభం కానుంది. ఇంతగా సుందరీకరణ జరుగుతున్న చోట చేపల విక్రయాలు మాత్రం అలాగే కొనసాగుతుండటంపై పట్టణ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కావమ్మకు విశేష అభిషేకాలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 11న బుధవారం ఏడు గంగమ్మల జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో ఆదివారం చాటింపు వేశారు. ఈక్రమంలో పట్టణంలోని పూసలవీధిలో మూడో గంగమ్మ కావమ్మ అమ్మవారి తెట్టురాయికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పసుపు, కుంకుమ, గంధం, పన్నీరు వంటి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేశారు. మహిళా భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వరరావు పవార్, జనార్దన రావు పవార్, శివాజీ, నరేంద్ర, సుకుమార్, జలగం ముని, శ్రీనివాసులు, భరత్, గోవిందు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ

ఏర్పేడు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం సీఐ జయచంద్ర ఆధ్వర్యంలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... దౌర్జన్యాలు, దాడులకు పాల్పడకూడదన్నారు. నేర పూరితమైన చర్యలకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చర్మకార సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక

తిరుపతి(వైద్యం), డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చర్మకార సేవా సంఘం సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లా రాజారావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పైడికత్తుల కాటయ్య, ఉపాధ్యక్షుడిగా మున్నంగి బాబు, కార్యదర్శిగా పైడికత్తుల చిన్నకాటయ్య, కోశాధికారిగా ఆదూరు దిలీప్, సంయుక్త కార్యదర్శిగా యాసరపు బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని చర్మకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

ముందుకు సాగని నాడు - నేడు భవన నిర్మాణాలు

అసంపూర్తి గదిలోనే 3,4,5 తరగతుల విద్యార్థులు





అసంపూర్తిగా ఉన్న భవనం - ఫ్లోరింగ్ లేకుండా ఉన్న తరగతి గది

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుచ్చినాయుడుకండ్రిగ ఉన్నత పాఠశాలలో నాడు నేడు కింద జరుగుతున్న పనులు ముందుకు సాగడం లేదు. దీంతో విద్యార్థులు గదులు చాలక ఇబ్బంది పడుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేశారు. అంతేకాకుండా ఈ పాఠశాలలోనే జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ప్రస్తుతం పాఠశాలలో మొత్తం 950 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. 20 గదుల్లో 23 సెక్షన్ల విద్యార్థులు చదువుకుంటున్నారు. విద్యార్థులకు గదులు చాలకపోవడంతో నాడు నేడు కింద పాఠశాలకు రూ. 1.17కోట్లతో పది గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అయితే మొదటి, రెండో అంతస్తులో ఐదేసి గదుల చొప్పున శ్లాబ్ కూడా పోశారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల క్రితం పనులు ఆపి వేశారు. దీంతో గదులు చాలక, చేసేది లేక 3, 4, 5 తరగతుల విద్యార్థులకు ప్రస్తుతం అసంపూర్తి భవనంలో బల్లలు వేసి కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి భవనాలను పూర్తి చేయాలని విద్యార్థులు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కౌట్‌కు ఎమ్మెల్యే అభినందన



శ్రీనివాసులును అభినందిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక ఉన్నత పాఠశాలకు చెందిన స్కౌట్ ఎస్.శ్రీనివాసులును శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ అభినందించారు. ఇటీవల గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా రాజ్య పురస్కార్ సర్టిఫికెట్ అందుకున్న శ్రీనివాసులును అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్, సహాయ కమిషనర్ పార్వతి, స్కౌట్ మాస్టర్ యోగానందం, పాఠశాల కమిటీ చైర్మన్ రజియ పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు



శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీలో ఆదివారం పలువురు చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో న్యాయవాది కేవీ రమణ, దావల సుబ్రహ్మణ్యం, రామచంద్రయాదవ్, సుబ్రహ్మణ్యం, వెంటకయ్య తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు టి. గణేష్, నాయకులు శివకుమార్, జ్యోతిరాం, సురేష్, వెంకటరమణ యాదవ్, దుమ్ము రాయల్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా సిమెంట్ రోడ్ల నిర్మాణం



కాంపాళెం దళితవాడలో రోడ్డు నిర్మాణం

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాంపాళెం దళితవాడలో ఉపాధి హామీ నిధులతో సర్పంచా మాచాలమ్మ ఆధ్వర్యంలో ఆదివారం సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దళితవాడలోని ఉత్తరం వైపు ఉన్న వీధికి సిమెంట్ రోడ్డు లేక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల మండలంలోని పంచాయతీలకు ఉపాధి నిధులు మంజూరు కావడంతో రూ. 5లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.

కేవీబీపురంలో...



స్వర్ణ లింగేశ్వరపురం వద్ద రోడ్డు నిర్మాణం

కేవీబీపురం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవీబీపురం మండలంలో రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేసింది. దీంతో ఆయా గ్రామాల్లో సిమెంటు రోడ్లు రూ.5లక్షలు, రూ.10 లక్షలు, రూ.20లక్షలతో పనులు ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులను సోమవారం లోపు ప్రారంభించకపోతే రద్దు చేస్తామని ఎంపీడీవో రాధారాణి చెప్పడంతో కాంట్రాక్టర్లు శరవేగంగా పనులను ప్రారంభిస్తున్నారు. పనుల్లో నాణ్యత లేకపోయినా, కొలతలకు తక్కువగా ఉన్నా ఎట్టి పరిస్థితిలో బిల్లులు మంజూరు కావని అధికారులు చెప్పడంతో ఆ మేరకు పనులు జరుగుతున్నాయి.

హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత



ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసరాలను అందజేస్తున్న హెల్పింగ్‌హ్యాండ్స్ నిర్వాహకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నగరివీధిలో గల హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులు, వృద్ధులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువతరం సేవా సమితి సభ్యుడు యువకిషోర్ మాట్లాడుతూ 156 నెలలుగా ప్రతి నెలా నిత్యావసర సరుకులు వితరణ చేయడం హర్షణీయమన్నారు. మునీర్‌బాషా, జి.రమేష్ బాబు, రాజేశ్వరరావు, బాబా ఫరీద్, డిల్లీకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.